# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



## కరెంటు కోతల కాంగ్రెస్ మాకొద్దు



కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మళ్లీ రైతులకు కరెంటు కష్టాలే, చీకటి రోజులే. కేసీఆర్ ప్రభుత్వం వచ్చాక రైతులకు కరెంటు కష్టాలు పోయాయి. వ్యవసాయాన్ని పండగలా చేస్తున్నారు. రైతులకు మూడు గంటల కరెంటు చాలంటూ రైతులను ఆగం చేయాలని కాంగ్రెసోళ్లు చూస్తున్నారు. మూడు గంటల కరెంటుతో వ్యవసాయం చేయలేం. మూడు గంటల కరెంటు ఇస్తే.. రైతులంతా ఒకేసారి మోటర్లు ఆన్ చేస్తే ట్రాన్స్‌ఫార్లర్లపై లోడు పడి కాలిపోయే ప్రమాదం ఉంది. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మాకొద్దు. ఆ తిప్పలు మేము పడలేం. మాకు మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమే కావాలి.

**– ఊరబెద్ది వెంకన్న, రైతు, కమలాపురం, ములకలపల్లి మండలం**

## కాంగ్రెస్‌తో ఆగమాగమే



కాంగ్రెసోళ్లు అధికారంలోకి వస్తామని పగటి కలలు కంటూ ఎన్నికల మ్యానిఫేస్టోలో అమలు చేయలేని హామీలు ఇస్తున్నారు. కాంగ్రెస్ పాలిత ప్రాంతాల్లో రైతాంగానికి వారు 24 గంటలు ఇవ్వలేకపోతున్నారు. తెలంగాణలో రైతులకు కరెంట్ ఇస్తారా? వారి మాటలను రైతులు నమ్మరు. కాంగ్రెస్ నాయకుల మాటలు వింటే రైతులు ఆగమాగమే. వారి మాటలు పట్టించుకోకుండా, నిరంతరం ఉచిత కరెంట్ ఇస్తున్న బీఆర్‌ఎస్ పార్టీకి అండగా ఉండాలి. రైతుల సంక్షేమం కోరే కేసీఆర్ మళ్లీ సీఎం కావాలి.

**– అయ్యోరు వెంకటేశ్వర్లు, రైతు, చౌప్పాల గ్రామం, కరకగూడెం మండలం**

## ధరణి రద్దుతో రైతుల బతుకులు నాశనం



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామని అంటున్నారు. ధరణి తీసివేస్తే తిరిగి మళ్లీ రైతుల బతుకులు నాశనమవుతాయి. భూముల రికార్డులను దళారులు తారుమారు చేసి లంచవతారం ఎత్తుతారు. ప్రస్తుతం రైతులు ధరణితో చాలా ప్రశాంతంగా ఉన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో రైతులు చాలా సంతోషంగా ఉన్నారు. తిరిగి మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి పట్టం కట్టాలని, ముఖ్యమంత్రిగా కేసీఆర్‌నే చూడాలని అంటున్నారు.

**– బుడగం రాము, రైతు, కరకగూడెం మండలం**

## 24 గంటల కరెంటుతో కష్టాలు తీరాయి



24 గంటల కరెంటుతో మా కష్టాలు తీరాయి. దీనికి ముందు కరంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని దుస్థితి. కరెంటు సమస్యతో జనరేటర్లు వాడాల్సి వచ్చేది. జనరేటర్‌కు డీజిల్, మరమ్మతులతో ఆర్థిక ఇబ్బందులు తీవ్రంగా ఎదుర్కొన్నాం. కేసీఆర్ సర్కారులో 24 గంటల కరెంటుతో మా సమస్యలన్నీ తీరినయి. జనరేటర్లు అవసరం పడలేదు. నర్సరీలకు అవసరమైన సమయంలో నీటిని వినియోగించుకుంటున్నాం. నర్సరీలకు ఉచిత విద్యుత్ ఇస్తామని బీఆర్‌ఎస్ హామీ ఇచ్చింది. కేసీఆర్‌కే మా ఓటు.

**– రాఘవేంద్ర రావు, లక్ష్మీ వెంకటేశ్వర నర్సరీ యజమాని, మందలపల్లి గ్రామం, దమ్మపేట మండలం**

## అమ్మ తోడు... 'కారు'కే ఓటు



కేసీఆర్‌ను జీవితంలో ఎప్పుడూ మర్చిపోను. రైతులెవరూ అడగకుండానే రైతుబంధు పథకాన్ని తీసుకొచ్చి ఆదుకున్నారు. ఈ ఎన్నికల్లో ఆయనే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని రైతులంతా కోరుకుంటున్నారు. పంట పండించుకోవడానికి ఖర్చు కోసం ఇబ్బంది పడాల్సిన బాధ పోయింది. అమ్మ తోడుగా చెబుతున్నా... మా రైతుల ఓటు కారు గుర్తుకే.

**–బండి వెంకటరెడ్డి, రైతు, దమ్మపేట**

## కౌలు రైతులకు రైతుబంధు అభ్యంతరకరం



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కౌలు రైతులకు రైతు బంధు ఇస్తామని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రకటించడం అభ్యంతరకరం, అర్థరహితం. రైతులకు ఇది వ్యతిరేకమైనది. రేవంత్ రెడ్డి ప్రకటన.. రైతుల్లో అయోమయాన్ని, భయాన్ని పెంచుతున్నది. కౌలు రైతులకు రైతు బంధు ఇవ్వడమంటే.. కౌలు భూమిపై వారికి హక్కు కల్పించినట్లే అవుతుంది. ధరణిలో ఉన్నట్లు పట్టాదారులైన రైతులకు మాత్రమే రైతుబంధు ఇవ్వాలి. భూమిపై వేరే వాళ్ల పెత్తనాన్ని రేవంత్‌రెడ్డి ప్రోత్సహిస్తున్నట్లు అనిపిస్తున్నది. ఇది కరెక్టు కాదు. కాంగ్రెస్ పార్టీ విధానం సరైనది కాదు. అందుకే ఆ పార్టీకి రైతులు ఓట్లు వేయరు. వారందరినీ సంఘటితపరిచి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఓట్లు వేయిస్తాం.

**– గాదె లింగయ్య, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్, చంద్రుగొండ మండలం**

## కరెంటు పుష్కలం.. పంట పండుతున్నది



గత తొమ్మిదేండ్లుగా కరెంటు పుష్కలంగా ఉండటంతో రైతుల పంట పండింది. కాంగ్రెస్ హయాంలో తొమ్మిది గంటల కరెంటని చెప్పి.. కేవలం రెండు, మూడు గంటలు మాత్రమే ఇచ్చేవారు. అది కూడా మూడు విడతల్లో ఇచ్చేవారు. ఆ నీరు కాలువలు తడవటానికే సరిపోయేది. పంటలు పండేవి కావు. సీఎంగా కేసీఆర్ వచ్చిన నాటి నుంచి కరెంటు పుష్కలంగా ఉంటున్నది. మంచిగా పంటలు పండుతున్నాయి. ఏ ఒక్క రైతూ ఇబ్బందులు పడటం లేదు.

**– చాపలమడుగు రామరాజు, రైతు,అయ్యన్నపాలెం గ్రామం, చంద్రుగొండ మండలం**

## ధరణి తీసేస్తే కష్టాలు తప్పవు



ధరణితో రైతుల భూముల వివరాలు ఆన్‌లైన్‌లో కనపడతున్నాయి. పట్టాదారు పాసు పుస్తకం కూడా ఇచ్చారు. ధరణి తీసేసి, పాత పద్ధతి తెస్తా మన కాంగ్రెసోళ్లు అంటున్నానరు. అప్పుడు పట్వారీల ఇండ్ల చుట్టూ, రెవెన్యూ కార్యాలయం చుట్టూ రోజులతరబడి తిరగాల్సి వస్తుంది. ధరణిని తీసివేస్తే రైతుల భూములు మాయమవుడు ఖాయం. ఎవరు పడితే వారు భూములు తమ పేర్లను ఎక్కించుకునే పరిస్థితి వస్తుంది. రైతుల మధ్య గొడవలు జరగుతాయి. ఈ కష్టాలన్నీ మాకొద్దు. మాకు కేసీఆర్ ప్రభుత్వమే కావాలి.

**– సత్తి నాగేశ్వరరావు, రైతు, రేపల్లెవాడ గ్రామం, చంద్రుగొండ మండలం**

## కేసీఆర్ సారు.. కొండంత అండ



గత కాంగ్రెస్ పాలనలో కరెంటు కోసం ఎన్నో కష్టాలు పడ్డాం. మూడు గంటల కరెంటుతో వ్యవసాయం చేయలేం. రైతు బిడ్డ, సాగు కష్టాలు తెలిసిన కేసీఆర్ సీఎంగా ఉండటం.. తెలంగాణ రైతుల అదృష్టం. రైతులకు కేసీఆర్ ప్రభుత్వం కొండంత అండగా నిలిస్తున్నది. 10 హెచ్‌పీ మోటర్లను పెట్టుకుని మూడు గంటల కరెంటుతో పంటలను పండించడలేం. అందరూ ఒకేసారి మోటర్లు వేస్తే ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ ఎక్కువ పడి కాలిపోతాయి. ఇప్పుడు 24 గంటల నాణ్యమైన కరెంటు ఇచ్చి, రైతు కుటుంబాలను సీఎం కేసీఆర్ ఆదుకుంటున్నాడు. కాంగ్రెస్ మళ్లీ రైతులను మోసం చేయాలని చూస్తున్నది. వారికి ఓటుతో బుద్ధి చెప్పాలి. వారిని నమ్మితే.. ఇప్పుడిప్పుడే కుదుట పడుతున్న అన్నదాతలకు మరోసారి ఆగమైతరు. గత కాంగ్రెస్ పాలన అనుభవాలను గుర్తు చేసుకోవాలి. రైతులమంతా మళ్లీ కాంగ్రెస్ రావొద్దనే కోరుకుంటున్నం.

**– పలగాని పుల్లయ్య, రైతు, బుచ్చన్నగూడెం, అన్నపురెడ్డిపల్లి మండలం**



### ధరణి వల్ల రైతులకు మంచి జరుగుతుంది

ధరణితో రైతులకు మంచి జరుగుతుంది. ధరణి పెట్టక ముందు రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. భూములకు పట్టాలు లేక అనేక ఇబ్బందులు పడ్డాం. ధరణి వచ్చాక సులువుగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. తహసీల్దార్ సమక్షంలో రైతులు భూములు బదిలీలు, మార్పులు చేసే అవకాశం ఉంది. రైతులకు తెలియకుండా వారి భూమిపై ఎవరికి ఎలాంటి అధికారం లేకుండా చేసిన కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు. కేసీఆర్ వెంట సాగుతాం. కారు గుర్తుకే ఓటేసి బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాం.

**– బానోత్ వాలు, మొక్కంపాడు తండా, టేకులపల్లి మండలం**

# ఎవుసం ఎండుల్లే..

# కాంగ్రెసొస్తే రైతు ఖతమే

- వ్యవసాయరంగం మంట కలుస్తది
- అన్నదాతల ఆత్మహత్యలు మొదలైతయ్..
- మళ్లీ దళారులు రాజ్యమేలుతరు
- '3 గంటలు-10 హెచ్‌పీ'తో ముప్పు తప్పదు
- పల్లెల్లో భయాందోళనలకు గురవుతున్న రైతులు
- కాంగ్రెస్ నేతల మాటలపై చిర్రెత్తుతున్న అన్నదాతలు



భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ) : ఏటా సాగు పనులు చేసుకుంటూ జీవితాలు గడుపుతున్న రైతులపై కాంగ్రెస్ నేతలు కక్షగట్టారు. అసెంబ్లీ ఎన్నికల సభలు, సమావేశాల్లో ఒక్కో నేత రోజుకో విధంగా మాట్లాడుతూ మానసిక ఇబ్బందులకు గురిచేస్తున్నారు. మూడు గంటల కరెంటుతో పంటలు పండించుకోవచ్చని, 10హెచ్‌పీ మోటర్‌తో నీరు పారించుకోవచ్చని చెబుతున్నారు. ధరణి పోర్టల్‌ను తొలగించి భూమాత పోర్టల్ పెడతామని చెబుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు లోతైన ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది. ఆదమరిస్తే తిరిగి అర్ధరాత్రి కరెంటు తిప్పలు తప్పకపోవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. స్వరాష్ట్ర సాధనకు ముందు రైతులు ఎదుర్కొన్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. రాత్రనక పగలనక పొలంలో జాగారం చేస్తే తప్ప పంట చేతికొచ్చేది కాదు. వచ్చీరాని కరెంట్‌తో మాటిమాటికీ మోటర్లు కాలిపోవడంతో రైతులపై మరింత ఆర్థిక భారం పడేది. ఈ క్రమంలో ఎంతో మంది రైతులు సాగుకు స్వస్తి పలికి పట్టణాలు, నగరాలకు వలసబాట పట్టిన పరిస్థితులు ఉండేవి. ఎవుసానికి మూలాధారమైన విద్యుత్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు సీఎం కేసీఆర్ విశేష కృషి చేశారు. సాగు రైతులు ఇబ్బంది పడొద్దనే ఉద్దేశంతో 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందుబాటులోకి తెచ్చారు. రైతుల పక్షాన నిలిచి వివిధ పథకాలను అందిస్తున్న క్రమంలో రైతులందరూ ఏ సమస్యా లేకుండా పంటలు పండించుకుంటుంటే.. ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు సాగుకు మూడు గంటల కరెంటు సరిపోతుందని చెప్పడంతో మళ్లీ భయాందోళనలకు గురవుతున్నారు.

### ధరణిని తొలగిస్తే దళారుల రాజ్యమే..

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌ను తీసివేస్తే తిరిగి తెలంగాణలో దళారుల రాజ్యం తప్పకపోవచ్చు. కొద్ది రోజులుగా కాంగ్రెస్ నాయకులు ధరణి పోర్టల్‌ను తీసివేస్తామని చెబుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి పాలనలో భూమిని సాగు చేసుకునేది ఒకరైతే.. భూ యజమానులు మరొకరు. వారసత్వంగా వచ్చిన భూమిని పంచుకునేందుకు నాడు అన్నదమ్ములు పడ్డ అవస్థలు అనేకం.గ్రామాల్లో భూ పంచాయితీ వచ్చిందంటే చాలు దళారులు, పట్వారీలకు పండగే. దీంతో ఎక్కడ చూసినా నిత్యం భూ పంచాయితీలే. చివరకు ఆడపిల్లకు పసుపు కుంకుమల కింద ఇచ్చిన భూమిని సైతం ఆపద కాలంలో అమ్ముకోవాలంటే నానా ఇబ్బందులు పడేవారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుదీర్ఘ ఆలోచన చేసిన సీఎం కేసీఆర్ భూ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిన విషయం విదితమే. అనేక మంది నిపుణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం ఎట్టకేలకు ధరణి వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. భూ వివరాలను పూర్తిగా ఆన్‌లైన్ చేసుకునేందుకు, సాదా బైనామాలకు అవకాశం కల్పించడంతో లక్షలాది మంది రైతులకు ప్రయోజనం కలిగినట్లైంది. పైసా ఖర్చు లేకుండా కొత్త పాస్ పుస్తకాలు రావడంతో దశాబ్దాల కల, అనేక చిక్కుముడులకు చెక్ పడినట్లైంది. దీంతో ప్రస్తుతం సాగు రైతులకు ధరణి కొండంత ధైర్యం ఇచ్చినట్లైంది.

## ధరణి తీసేస్తే రైతులు ఆగమే



ధరణిని తీసేసి, దళారుల రాజ్యం తెస్తామని కాంగ్రెసోళ్లు అంటున్నరు. మళ్లీ ఒకసారి రైతులను నట్టేట ముంచుదమని చూస్తున్నరు. ధరణి ద్వారా రైతులకు ఎంతో మేలు చేకూరింది. ఇది వచ్చాకే మా భూములకు భద్రత ఏర్పడింది. గతంలో ఉన్న పట్వారీ, పటేల్ వ్యవస్థతో కూడిన రెవెన్యూ విధానం వల్ల భూమి రికార్డులన్నీ గందరగోళంగా ఉండేది. రైతులు పాస్ బుక్‌ల కోసం నెలలతరబడి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ చెప్పులరిగేలా తిరగాల్సి వచ్చేది. ఈ ఎన్నికల్లో రైతులను మోసం చేయాలని కాంగ్రెస్ చూస్తున్నది. రైతులు తన చేతగాక కౌలుకి ఇస్తే అప్పుడు రికార్డులో కౌలుదారు పేరు నమోదు చేసేవారు. ధరణిని తీసివేస్తే మళ్లీ పాత కథే పునరావృతం అవుతుంది. అసలు రైతు తన భూమిపై హక్కు కోల్పోయే ప్రమాదం ఉంది. రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం వెంటే మేము ఉంటం.

**– ఎల్లు సత్తిరెడ్డి, రైతు, పినపాక గ్రామం, మండలం**

## 24 గంటల కరెంటుతో పంటలు మంచిగ పండుతున్నాయి



ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో 24 గంటల కరెంటుతో పంటలు మంచిగ పండుతున్నాయి. గత కాంగ్రెస్ పాలనలో కరెంటు కోతలతో ఎన్నో కష్టాలు పడ్డాం. వ్యవసాయం చేయాలంటే భయమయ్యేది. ఇప్పుడు మూడు గంటల కరెంటు ఇస్తామని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. మూడు గంటల కరెంటుతో నారు మడి కూడా తడవదు. ఇక 10 హెచ్‌పీ మోటర్లు పెడితే బోర్లు ఎండిపోతాయి. కేసీఆర్ నాయకత్వంలోనే పండుగలా వ్యవసాయం చేసుకుంటున్నాం. కాంగ్రెస్ వచ్చి ధరణిని తీసేస్తదట. అధికారుల కడుపు నింపే భూమాత తెస్తదట. ఇదే జరిగితే.. రైతులకు కష్టాలు వచ్చినట్లే. భూమాత వద్దు, మూడు గంటల కరెంటు వద్దు, అసలు కాంగ్రెసే వద్దని రైతులు అంటున్నారు. అప్పుడు అరిగోసలు పెట్టి, ఇప్పుడు మళ్లీ వస్తున్న కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని అంటున్నారు. రైతులను రాజులను చేసిన బీఆర్‌ఎస్‌నే గెలిపించుకుంటామంటున్నారు.

**– అలవాల శ్రీను, రైతు, కొండాయిగూడెం, మణుగూరు మండలం**

## కేసీఆర్ వల్లే రైతుల కళ్లల్లో ఆనందం



తెలంగాణ రాష్ట్రంలో రైతుల కళ్లల్లో ఆనందం సీఎం కేసీఆర్ వల్లే చూస్తున్నాం. రైతులకు 24 గంటల ఉచిత కరెంట్. కేంద్ర ప్రభుత్వం రైతుల విద్యుత్ మోటర్లకు మీటర్లను పెట్టమని చేబితే మోటర్లకు మీటర్లు బిగించనని తేల్చి చెప్పి రైతుల సంక్షేమం కోసం 24గంటలు కరెంట్ ఇస్తున్నారు. రైతుబంధు, రైతుబీమా, ఉచిత కరెంట్ ఇవ్వడంతో రైతులు ఆర్థికం ఎదిగారు. రైతులకు విత్తన, ఎరువులు సకాలంలో అందించి రైతులకు అండగా నిలిచారు. రైతు కళ్లల్లో ఆనందాన్ని నింపిన కేసీఆర్ వెంటనే రైతులు ఒటారు. కారు గుర్తుకు ఓటేసి కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేస్తాం.

**– కుమ్మరి కిరణ్, సులానగర్ గ్రామం, టేకులపల్లి మండలం**

## దేశానికే వెలుగు పంచే స్థాయికి తెలంగాణ



తెలంగాణ రాష్ట్రం దేశానికే వెలుగులు అందించే స్థాయికి ఎదిగింది. ఉమ్మడి రాష్ట్రంలో కరెంటు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాం. సాయంత్రం కాగానే కటిక చీకట్లు. పగలు, రాత్రి తేడా లేకుండా కరెంట్ కోతలు. ఎండాకాలంలో కరెంటు లేక ఉక్కపోతతో అవస్థలు పడ్డాం. కరెంటు లేక పంటలు పండేవికావు. నీరు పొలాలకు సరిపోయేవి కావు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ హయాంలో కరెంటుకు కొదవ లేదు. పంటలతో పాటు అన్ని ఎలక్ట్రానిక్ వస్తువులు అన్ని సజావుగా వినియోగించుకుంటున్నాం. సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు. మళ్లీ కేసీఆర్ సారుకే ఓటు వేస్తాం. ఆయనే ముఖ్యమంత్రి కావాలి.

**– బాదావత్ రమేశ్, భద్రుతండా గ్రామం, పోలారం పంచాయతీ, ఇల్లెందు మండలం**

## కౌలు రైతులకు ఇస్తే సమస్యలొస్తయి



రైతుబంధు పెట్టుబడి రైతుకు కాకుండా కౌలు రైతులకు ఇవ్వొద్దు. వారికి ఇస్తే అనేక సమస్యలు వస్తయి. కాంగ్రెస్ పార్టీ చెబుతున్నట్లు ధరణి తీసేస్తే రైతులకున్న రక్షణ పోతది. గతంలో ఉన్న పాత పద్దతి వస్తే రైతులు ఆగమయితరు. రెవెన్యూ రికార్డుల్లో కౌలు రైతు పేరు ఎక్కితే నిజమైన రైతుకు అన్యాయం జరిగే అవకాశం ఉంది. రెవెన్యూ అధికారులు లంచాలు తీసుకొని రైతుల పేరుపై ఉన్న రికార్డులను మాయం చెయవచ్చు. పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టు తిరగాలి. ధరణి ఉంటేనే రైతులకు మేలు. రైతు బంధు ధరణి ద్వారానే వస్తుంది. రైతులకు వ్యతిరేకంగా కాంగ్రెస్ ఉంది. దాన్ని నమ్మను. ఈ ఎన్నికల్లో కేసీఆర్ కారు గుర్తుకు వేస్తం.

**– గుమ్మడి సత్యనారాయణ, రైతు, ఎల్లాపురం, ఇల్లెందు మండలం**

## రైతులకు మూడు గంటల కరెంటు సరిపోదు



కాంగ్రెస్ చెప్తున్న మూడు గంటల కరెంటు.. సాగుకు ఏమాత్రం సరిపోదు. రైతులను కాంగ్రెసోళ్లు అప్పట్లో అరిగోస పెట్టిన్రు. సాగు నీరు మొదలుకుని విత్తనాలు, ఎరువులకు చాలా ఇబ్బందులు పడ్డం. వ్యవసాయం ఎట్ల చేస్తరో కూడా కాంగ్రెసోళ్లకు తెల్వదు. మూడు గంటలు కరెంటు చాలని పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నరు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుల కష్టాలను తెలుసుకుని 24 గంటలు సాగుకు ఉచిత విద్యుత్ ఇస్తున్నది. రైతులందరూ పుష్కలంగా రెండు పంటలు పండించుకుంటున్నరు. గింత మంచి సర్కారును వదులుకునేది లేదు. కాంగ్రెస్ చెప్తున్న మోసపు మాటలను రైతులు వినేది లేదు. మా సంక్షేమాన్ని కోరే బీఆర్‌ఎస్‌కే మద్దతునిస్తాం. మళ్లీ కేసీఆర్‌నే సీఎం చేసుకుంటం.

**– శేరు రామయ్య, రైతు, పినపాక గ్రామం/మండలం**

## ధరణి రద్దు చేస్తే దళారుల రాజ్యమే



ధరణిని రద్దు చేస్తే దళారుల రాజ్యమే వస్తుంది. కాంగ్రెస్ నాయకులు రాజకీయ పబ్బం గడుపుకునేందుకే చిల్లరమల్లర మాటలు మాట్లాడుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి పోర్టల్‌తో భూములకు రక్షణ దొరికింది. బీఆర్‌ఎస్ పాలనలోనే మా బతుకులు బాగున్నాయి. రైతుల బాధలు తెలిసిన సీఎం కేసీఆర్.. పెట్టుబడి కోసం ఇస్తున్న రైతుబంధుతో రెండు పంటలు పండుగలా పండిస్తున్నాం. కాంగ్రెస్ పాలనలో పడిన కష్టాలు ఇంకా గుర్తున్నాయి. అందుకే వారికి ఓటు వేయం. రైతులమంతా కారు గుర్తుకు ఓటు వేసి కేసీఆర్‌ను మళ్లీ గెలిపించుకుంటాం.

**– పిట్టల శ్రీను, రైతు, శ్రీకృష్ణాపురం, మణుగూరు మండలం**